## క్లుప్తంగా

### 'ప్రజాపాలన'.. ఏర్పాట్లు పూర్తి

**నారాయణపేట టౌన్:** ప్రజాపాలన దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నారాయణపేట మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం దాని పరిసరాల ప్రాంతాలు, సైన్స్ పార్కు, మున్సిపాలిటీలోని పరిసరాలను మంగళవారం జరిగే ప్రజాపాలన దినోత్సవం వేడుకలకు దగ్గరుండి శుభ్రం చేయించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా పాలన వేడుకలలో భాగంగా జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరవుతారని వెల్లడించారు.

### ఎమ్మెల్యేకు సన్మానం



**నారాయణపేట:** నారాయణపేట–మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఎకరాకు రూ.20 లక్షలు ఇచ్చేలా కృషి చేసినందుకు భూ నిర్వాసితుల సంఘం నేతలు మంగళవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిని శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేశారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో భూనిర్వాసితుల సంఘం నాయకులు భీమ్ రెడ్డి, మోహన్, దస్తప్ప,నరహరి భాస్కర్ సుదర్శన్ తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**నారాయణపేట రూరల్:** జిల్లా కేంద్రంలోని శ్రీ హంసవాహిని, కృష్ణ గోకులం, మాడ్రన్, నారాయణ, సరస్వతీ శిశుమందిర్ తదితర పాఠశాలలలో మంగళవారం పాలమూరు కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ శశి సహకారంతో పిల్లల్లో కంటి శుక్లము, పొర, కంటి లూటీ సమస్యలను గుర్తించి శస్త్ర చికిత్సకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అంజి, దివ్య, దర్శన, పాఠశాలల ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

### రెండో రోజు కొనసాగిన కోతుల పట్టివేత



**మద్దూరు:** పట్టణంలో కోతుల పట్టివేతను మంగళవారం కూడా కొనసాగించారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి బృందం 5 కోతులను పట్టుకొని బోనులో బంధించారు. పట్టుకున్న కోతులను కొయిల కొండ దగ్గరలోని అడవిలో వదిలేయనున్నట్లు పేర్కొన్నారు.

### బీమా పాలసీతో రక్షణ

**నారాయణపేట రూరల్:** ప్రతి కుటుంబం ఎల్ఐసీలో బీమా పాలసీ తీసుకొని రక్షణ పొందాలని సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి అన్నారు. ఇటీవల ఏజెంట్లకు నిర్వహించిన జైత్రయాత్ర పోటీలలో విజేతగా నిలిచిన ఆనంద్‌కు మంగళవారం ఆయన ఇంటిలో మహారాజ సన్మానం చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. బీమా పాలసీ ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితుల్లో దాని అవసరంపై వివరించారు. మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ రావు, బ్రాంచ్ మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

**నారాయణపేట రూరల్:** ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. మండలంలోని బొమ్మన్ పాడు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 'మాకే నామ్ ఏక్ పేడ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో సహాయపడతాయని, ఇప్పటికే నీటిని కొనాల్సిన పరిస్థితి మొదలైందని రాబోవు రోజుల్లో ఆక్సిజన్ కొనాల్సిన దుస్థితి రాకుండా మొక్కలు నాటాలని సూచించారు. మాజీ వైస్ ఎంపీపీ సుగుణ, మాజీ ఎంపీటీసీ హనుమంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సింగారంలో నీటి కష్టాలు

**నారాయణపేట రూరల్:** మండలంలోని సింగారం గ్రామంలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గ్రామంలోని శివాలయం, జీపీ ఆఫీస్, కుర్వగేరి, పోస్ట్ ఆఫీస్ ఏరియాలలో సమస్య మరింత దారుణంగా ఉంది. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గ్రామానికి ప్రత్యేక అధికారిగా ఉన్నప్పటికీ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలున్నాయి. వెంటనే గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇంటింటికీ డిజిటల్ నంబర్



కోస్గి పట్టణం వ్యూ

- ప్రతి ఇల్లు ఆన్‌లైన్‌లో నమోదు
- ఆస్తి హక్కుపై పూర్తి భద్రత
- చర్యలు చేపట్టిన పుర అధికారులు

**కోస్గి రూరల్:** ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా మున్సిపాలిటీల్లో అధికారులు ఇకపై కఠిన నిబంధనలు అమలు చేయబోతున్నారు. మున్సిపాలిటీ సేవల్లో పారదర్శకత.. జవాబుదారితనం ఉండేలా ఆధునిక సాంకతికను వినియోగించుకొని ప్రతి ఇంటికి ఒక డిజిటల్ నంబరు కేటాయించనున్నారు. ఈ కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం అధికారులు తప్పు చేసినా.. ఇంటి యజమాని తప్పు చేసినా.. ఎవరు తప్పు చేసినా ఇంటి యజమానిదే బాధ్యత. ఇంటి నిర్మాణ విషయంలో మున్సిపల్ చట్టాన్ని అతిక్రమిస్తే పాతికరేట్లు జరిమానా విధించనున్నారు.

**ఆచరణలోకి డిజిటలైజేషన్...**

కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి ఇంటిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అలాగే ప్రతి ఇంటికి ఒక డిజిటల్ నంబర్ ఉండాలి. ఆన్‌లైన్‌లో లేని ఇంటికి జరిమానాలు విధించే ఆదికారం మున్సిపల్ సిబ్బందికి ఉంటుంది. నంబరుతో ఆస్తులకు భద్రత లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇక ఇళ్లకు కూడా డిజిటల్ నంబర్లు కేటాయించాలని మున్సిపల్‌శాఖ నిర్ణయించింది. దీని ద్వారా యజమాని ఇంటి వివరాలతో పాటు పన్ను చెల్లింపులు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

**వార్డుల ఆధారంగా ...**

మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు వార్డుల ఆధారంగా ఇంటి నంబర్లు కేటాయించారు. మొదటి అంకెతో మొదలై మధ్యలో అడ్డగీత తర్వాత ఇంటి నంబర్లు ఉన్నాయి. అయితే బై నంబర్లు పెరగడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో ఇళ్ల చిరునామా తెలుసుకోవడం కూడా కష్టంగా మారింది. పెరిగిన నివాస గృహాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఇళ్లకు డిజిటల్ నంబర్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా లోకేషన్‌తో సహ ఇతర సమాచారం తెలుసుకునేలా యాప్‌ను సైతం రూపొందించారు.

**పన్ను వివరాలు ఇట్టే తెలుసుకోవచ్చు..**

నూతన విధానంలో ఇకపై మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ఇళ్లకు డిజిటల్ నంబరు ప్లేట్ ఇవ్వనున్నారు. పిన్‌కోడ్ తరహాలో రాష్ట్ర, జిల్లా, పురపాలిక, వార్డులను తెలిపేలా ఈ కోడ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబరును ఇంటర్ నెట్‌లో నమోదు చేయడం ద్వారా గూగుల్ మ్యాప్ ద్వారా ఇంటి అడ్రస్ తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఇంటి నంబరుతో పాటు బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే పన్నుల చెల్లింపు , బకాయిల వివరాలు తెలుసుకోవచ్చు. ఇంటి ప్లాన్ ఇచ్చే ప్లానర్ తప్పు చేస్తే వారి లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంటుంది. మున్సిపల్ పరిధిలో ఇంటి నిర్మాణాలు చేయాలంటే నిబంధనలు పాటించాలని ఆధికారులు కోరుతున్నారు.

# యూరియా కష్టాలు తీరేదెన్నడో..!



రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

**మరికల్:** అన్నదాతలకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్, రైతు సేవా కేంద్రానికి 400 బస్తాల యూరియా రావడంతో మంగళవారం తెల్లవారుజాము నుంచే రైతన్నలు రైతు సేవా కేంద్రానికి క్యూకట్టారు. అయితే ముందుగా టోకెన్లు అందుకున్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. అయితే గంటల తరబడి లైన్‌లో నిల్చున్న పలువురికి యూరియా దొరకక పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టాలు తమ జన్మలో చూడలేదని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**యూరియా కోసం పడిగాపులు**

**నర్వ:** మండలంలో యూరియా కోసం రైతులు గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మంగళవారం మరో 26 టన్నుల యూరియా నర్వకు రాగా రైతులు మన గ్రోమర్, పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాశారు. అయినా కొందరికి యూరియా దక్కలేదు. దీనిపై ఏఓ అఖిలారెడ్డిని వివరణ కోరగా రైతులకు సరిపడా యూరియా వస్తుందని ఎవ్వరు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.



మన గ్రోమోర్ ఎదుట పాసు బుక్కులతో రైతులు

# రైతులకు సరిపడా యూరియా అందించాలి

**నారాయణపేట టౌన్:** రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ముందస్తు వర్షాలకు రైతులు పంటల సాగు చేపట్టారని, సకాలంలో యూరియా వేస్తేనే పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇంతవరకు కేవలం 5 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.



జాన్ సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

# విమోచన దినోత్సవంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

**ఊట్కూరు:** ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటుందని దీనిని విమోచన దినోత్సవంగా ప్రకటించాలని కోరారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించి ప్రభుత్వ పరంగా సంబరాలు జరుపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు భాస్కర్, భరత్, చంద్రశేకర్‌గౌడ్, కుర్వ ఆశప్ప, కొండన్‌గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

**'ప్రభుత్వానికి దమ్ములేదు'**

**నారాయణపేట రూరల్:** రాష్ట్రంలో ఓ వర్గం ఓటు బ్యాంకుకు భయపడి రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యకుడు అక్తర్ పాషా విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. నిజాం సామ్రాజ్యాన్ని ఎలా స్వాధీనం చేసుకున్నామో చరిత్ర ద్వారా తెలుస్తున్నా ఒకరేమో విలీనం అంటూ, మరొకరు విద్రోహం అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి జాతీయనేత రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారన్నారు. గిన్నిస్ రికార్డు సృష్టించేందుకు 75 చోట్ల రక్తదాన శిబిరాలను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

# అవినీతిపై విచారణ చేపట్టాలి

**నారాయణపేట టౌన్:** జిల్లా కేంద్రంలో చేనేత కార్మికుల సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మంగళవారం సీపీఐ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సీపీఐ మాస్‌లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి కంచె నారాయణ మాట్లాడుతూ... హ్యాండ్ లూమ్ వీవర్స్ సొసైటీకి చెందిన 4267 మంది చేనేత కార్మికులకు వారసత్వ సభ్యత్వం ఇవ్వకుండా, ప్రభుత్వ పరంగా సొసైటీకి సంబంధించిన జిల్లా సహకార కార్యాలయం డీసీఓ ఆఫీస్ ఆడిట్ రిపోర్టు ప్రకారం 4267 మంది చేనేత కార్మికులు ఉన్నట్లు చూపుతూ ఒక పక్క ప్రభుత్వాన్ని, మరో పక్క చేనేత కార్మికులను మోసం చేశారన్నారు. కావునా సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి చేనేత కార్మికులకు సభ్యత్వం కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. మండల కార్యదర్శి నరసింహా, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

# ఘనంగా శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మరికల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



శివకుమార్ రెడ్డితో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

**మరికల్:** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు కంభం శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చౌరస్తాలో జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పడ్లు, బ్రెడ్లను అందజేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, వీరన్న, హరీష్, కృష్ణయ్య, రాములు, ఆనంద్, చెన్నయ్య, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, రాజు, కుర్మన్న, రామన్‌గౌడ్, మల్లారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ:** డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమరెడ్డి జన్మదిన వేడుకలు ధన్వాడ, కిష్టాపూర్, గోటూర్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయి బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బస్టాండ్ వద్ద కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో రహిమన్‌ఖాన్, నారాయణ, నరేందర్‌గౌడ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

**శివన్నకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి**

**నారాయణపేట:** డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య శివన్న కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని శివన్నను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

**దామరగిద్ద:** మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక సంజీవరాయ ఆలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ఆవరణలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం

**మద్దూరు:** శరీరదారుఢ్యానికి, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మద్దూరు బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సరిత, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సాయినాథ్, వెంకటప్ప, కతలప్ప, కృష్ణవేణి, ఉపాధ్యాయులు రఘు, సూర్యప్రకాష్, వనజ, సునీత, నాగేందర్, యశ్వంత్ పాల్గొన్నారు.

**ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం**

**మరికల్:** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల అవరణలో మంగళవారం ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను జీహెచ్ఎం నాగరత్నమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా అండర్–14 లో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా ఖోఖోలో బాలుర జట్టు విజేతగా నిలవగా, కబడ్డీలో బాలికల జట్టు విజయం సాధించాయి.



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

### ఉపాధ్యాయుడికి సన్మానం



**కోస్గి రూరల్:** విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంచేందుకు కృషి చేస్తున్నందుకు కోస్గికి చెందిన ఉపాధ్యాయుడు మల్లేషంను డీఈఓ గోవిందరాజులు మంగళవారం అభినందించారు. మీర్జాపూర్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మల్లేషం పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులను హరిత సైనికులుగా తీర్చిదిద్దడం ఎంతో ఆదర్శమని ఆయన సేవలను కొనియాడారు.

### ఎన్ఈపీ శిక్షణలో జిల్లా టీచర్లు

**నారాయణపేట రూరల్:** జాతీయస్థాయిలో సీసీఆర్టీ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరుగుతున్న ఎన్ఈపీ శిక్షణలో నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్ పొందిన కృష్ణ మండలం కున్సి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహా, మక్తల్ ప్రభుత్వ పాఠశాల టీచర్ అశోక్ కు మార్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శన ఇచ్చారు.

### మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**కొత్తపల్లి:** మండలంలో అన్ని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేప ట్టినట్లు ఎంపీడీఓ కృష్ణారావ్ అన్నారు. మండల విద్యాధికారి ఆంజనేయులుతో కలిసి ప్రభుత్వ పాఠశాలలలోని వసతులను పరిశీలించారు. కనీస అవసరాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు, పాఠశాలల చుట్టూ ప్రహరీ ఎన్ని పాఠశాలల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన తప్పనిసరి

**దామరగిద్ద:** రాజ్యాంగం కల్పించిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లీగల్ సెల్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పిడెంపల్లి, లింగారెడ్డిపల్లి, మల్‌రెడ్డిపల్లి, కందెన్‌పల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, సీనియర్ సిటిజన్ యాక్ట్, మహిళల రక్షణచట్టం, వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# సొంత భవనాలు నిర్మించండి



మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**కృష్ణా:** మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలు లేక అటు అధికారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజప్పగౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్‌ఖాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్‌పాటిల్, సుదర్శన్, శంభర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు చేపట్టాలని రాస్తారోకో

**కృష్ణా:** మండలకేంద్రంలో అభివృద్ధి పనులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. మారుమూల ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలనే కాంక్షతో కృష్ణాను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. అయితే మండల కేంద్రంలోని రోడ్లు గుంతలమయంగా మారాయని, కనీస అవసరాలైన తాగునీరు, డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కూడా నిర్మించలేదని దుయ్యబట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు శివరాజ్ పాటీల్, బీజేపీ సీనియర్ నాయకుడు అమర్‌కుమార్ దీక్షిత్, బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సప్ప పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

# ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి



ఓజోన్ పొర గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

**కృష్ణా:** ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని కున్సీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంతోషి అన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓజోన్ నమూనాను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించి మొక్కలు పెంచాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు సౌమ్య, నరేందర్, గీత, నాగేష్ పాల్గొన్నారు.

**ఘనంగా ఓజోన్ దినోత్సవం**

**మాగనూర్:** వడ్వాట్‌లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజన్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ గొడుగులు పట్టుకొని ర్యాలీ నిర్వహిస్తూ ఓజోన్ పొరను రక్షించాలని నినాదాలు చేశారు.

### అందుబాటులో విత్తనాలు

**మద్దూరు:** యాసంగి సీజన్‌లో విత్తుకోవడానికి వేరుశనగ విత్తనాలు పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు చైర్మన్ నర్సింహా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25 కేజీ బస్తా రూ. 2,320కు లభిస్తుందని 100 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

### ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**మరికల్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలరిష్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం మరికల్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మహేష్, రాకేష్‌లు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తున్నట్లు తెలిపారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు.

### సైబర్ నేరాలపై అవగాహన

**మాగనూర్:** సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అశోక్‌బాబు ప్రజలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో డయల్–100 సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బంపర్ డ్రా తగిలిందని, ఆఫర్ వచ్చిందనో ఫోన్‌కు ఎస్ఎంఎస్ వస్తే వాటిపై క్లిక్ చేయొద్దన్నారు. అలాగే ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పొద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబర్ 1930 కి సమాచారం అందించాలన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ఊట్కూరు:** సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ తదితర అంశాలపై ఏఎస్ఐ సంజీవయ్య మంగళవారం అవగాహన కల్పించారు. అత్యాశకు పోయి అపరిచిత వ్యక్తుల చేతుల్లో మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేష్, నిహారిక, విజయ్ పాల్గొన్నారు.